క్లుప్తంగా

ఆయాల సమస్యలు పరిష్కరించాలని నిరసన



కలెక్టరేట ఎదుట ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కర్నూలు(సెంట్రల్): ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఆయాల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప డిమాండ్ చేశారు. మంగళవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఆయాలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. అలాగే పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయం కల్పించాలన్నారు. నాయకులు చంద్రశేఖర్, సుంకమ్మ, సిద్ధమ్మ పాల్గొన్నారు.

అజ్వా వెల్ఫేర్ సొసైటీ సేవలు ప్రశంసనీయం


మజ్జిగ పంపిణీ చేస్తున్న ఎస్వీ మోహన్‌రెడ్డి

కర్నూలు (టౌన్): నగరంలోని రాజ్‌విహార్ సెంటర్‌లో ఉచిత మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని ఏర్పాటు చేసిన అజ్వా వెల్ఫేర్ సొసైటీ సేవలు ప్రశంసనీయమని మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి అన్నారు. మంగళవారం మజ్జిగ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. వేసవిలో వాహనదారులు ఇబ్బందులు పడకుండా మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయమని కొనియాడారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు


తోపుడు బండ్లను తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

కర్నూలు: రోడ్డుకు ఇరువైపులా మొబైల్ క్యాంటీన్లు, తోపుడు బండ్లు పెట్టి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నారని ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో మంగళవారం చెన్నమ్మ సర్కిల్‌లో పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న పండ్లు, టిఫిన్ బండ్లు, మొబైల్ క్యాంటీన్లను తొలగించారు. తోపుడు బండ్లను ట్రాఫిక్ స్టేషన్‌కు తరలించారు. చిరు వ్యాపారులు ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా జాగ్రత్తలు పాటించాలని, లేకుంటే కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తామని ట్రాఫిక్ సీఐ గౌతమి హెచ్చరించారు.

ఇంటింటికీ వెళ్లి పథకాలను వివరించాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కల్లూరు: మేము సిద్ధం.. మా బూతు సిద్ధం కార్యక్రమాన్ని మంగళవారం కల్లూరు అర్బన్ 29, 37వ వార్డులకు సంబంధించి నాయకులతో నిర్వహించినట్లు కల్లూరు అర్బన్ జేసీఎస్ కన్వీనర్ ఇన్‌చార్జ్ గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన మంచిని, ప్రజలు పొందిన లబ్ధిని ఇంటింటికీ తిరిగి వివరించాలని సూచించారు. రాబోయ్యే ఎన్నికల్లో పార్టీ విజయానికి అందరు కలిసి సమష్టిగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కల్లూరు అర్బన్ క్లస్టర్ అధ్యక్షుడు (కార్పొరేటర్)సాన శ్రీనివాసులు, భీమాశంకర్‌రెడ్డి, కార్పొరేటర్ సుదర్శన్‌రెడ్డి, వార్డు సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్ పేర్ల మార్పునకు చర్యలు


రాజకీయ పార్టీల నేతలతో మాట్లాడుతున్న జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(సెంట్రల్): పోలింగ్ స్టేషన్ల పేర్లు, లోకేషన్ల మార్పునకు చర్యలు తీసుకుంటున్నట్లు పాణ్యం నియోజకవర్గ ఎన్నికల అధికారి, జేసీ నారపురెడ్డి మౌర్య అన్నారు. మంగళవారం తన చాంబర్‌లో పాణ్యం నియోజకవర్గంలోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులతో సమావేశమయ్యారు. కొన్ని ప్రాంతాల్లోని స్కూల్ బిల్డింగ్‌ల పేర్లు, ప్రదేశాలు మార్పు జరిగిందని.. అందుకు అనుగుణంగా వాటి పేర్లను మార్పు చేస్తామన్నారు. ఇప్పటికే మార్పులు చేసే పోలింగ్ స్టేషన్ల వివరాలు సేకరించారని, వాటిపై అభ్యంతరాలు ఉంటే తెలపాలని కోరారు.

నోటి శుభ్రత.. ఆరోగ్యానికి రక్ష

- నోటి ఆరోగ్యంలో దంతాలదే కీలక పాత్ర
- పెరుగుతున్న పంటి సమస్యలు
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు
- కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో మెరుగైన దంత వైద్యం
- నేడు జాతీయ దంత వైద్యుల దినోత్సవం

ఒకప్పుడు మధ్య వయస్కులు, వృద్ధులకు దంత సమస్యలు ఎక్కువగా వచ్చేవి. అయితే మారిన జీవన విధానం, ఆహారపు అలవాట్ల కారణంగా ఇటీవల కాలంలో యువత సైతం దంత సమస్యలతో బాధపడుతున్నారు. దంత వ్యాధులకు చికిత్స చేయించుకునేందుకు, నోటి ఆరోగ్యం, అందం కోసం వైద్యులను సంప్రదించే వారు అధికమయ్యారు. నేడు జాతీయ దంత వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని దంత సమస్యలు–ఆధునిక దంత చికిత్సా విధానాలు, దంత సంరక్షణ గురించి ప్రత్యేక కథనం

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో 70 నుంచి 80 శాతం ప్రజలు దంత సమస్యలతో బాధపడుతున్నారని వైద్యుల అంచనా. కర్నూలుతో పాటు దేవనకొండ, పత్తికొండ, కోడుమూరు, కల్లూరు, ఆదోని, ఆస్పరి వంటి ప్రాంతాల్లో తాగునీటి సమస్య వల్ల ఫ్లోరైడ్ ఎక్కువగా ఉండే నీటిని తాగుతున్నారు. దీని ప్రభావంతో పంటిపై పచ్చని రంగులో మచ్చలు ఏర్పడతాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజలు సరిగ్గా బ్రష్ చేయకపోవడం, ఏదైనా తిన్న తర్వాత నోటిని పుక్కిలించకపోవడం వల్ల దంత సమస్యలు వస్తున్నాయి. పంటి చుట్టూ గార ఏర్పడి చిగుళ్ల ఇన్‌ఫెక్షన్స్‌గా మారి రక్తం కారుతూ నొప్పి పుడుతుంది. దంతాలు బాగుంటే ఆహారాన్ని బాగా నమిలి తిని త్వరగా జీర్ణమయ్యేందుకు అవకాశం ఉంటుంది. చాలా మంది అవగాహన లోపం, కొన్ని అపోహలతో చికిత్స మానుకుని దంత సంరక్షణపై నిర్లక్ష్యం చేస్తున్నారు. ఇప్పుడు పుట్టిన పిల్లల నుంచి పెద్దల వరకు దంత సమస్యలు అధికమవుతున్నాయి. దీనికి ప్రధాన కారణం ఆహారపు అలవాట్లు, బ్రష్ చేసుకునే విధానంపై సరైన శ్రద్ధ వహించకపోవడమే.

పిప్పిపళ్లు రాకుండా.. పళ్లు పూర్తిగా పుచ్చిపోయాక చికిత్స చేసుకోవడం కన్నా ముందు జాగ్రత్తగా నివారించడం ఉత్తమం. చిన్నపిల్లలకు పిట్ అండ్ ఫిషర్ సీలెంట్స్ ద్వారా పిప్పిపళ్లు రాకుండా నివారించవచ్చు.


పెద్దాసుపత్రిలో దంత వైద్యం చేస్తున్న వైద్యులు

టీత్ వైటెనింగ్.. మన పళ్లు తెల్లగా ఉంటే మనం నలుగురిలో హాయిగా నవ్వగలం. ఫ్లోరోసిస్, ఇతర కారణాలతో పంటిపై గోధుమ రంగు మచ్చలు, ఛారలు ఏర్పడతాయి. వీటిని బ్లీచింగ్ పద్ధతి ద్వారా తొలగించి పళ్లను తెల్లగా మెరిసేలా చేయవచ్చు.

సింగిల్ విజిట్ ఇండికేషన్స్.. గతంలో రూట్‌కెనాల్ థెరపికి మూడు, నాలుగుసార్లు దంత వైద్యులను సంప్రదించాల్సి వచ్చేది. కానీ ఆధునిక పరిజ్ఞానంలో కేవలం ఒకే విజిట్‌లో ఆర్‌సీటీ పూర్తి చేయవచ్చు. చాలా సులువు, సమయం వృథా కాకుండా చూసుకోవచ్చు.

అలైనర్స్.. ఎత్తు, వంకర పళ్ల సవరణకు పూర్వం క్లిప్స్ ఉపయోగించేవారు. వీటితో చాలా మంది బయటకు అసౌకర్యంగా ఫీలయ్యేవారు. ఇప్పుడు అలైనర్స్ ద్వారా సౌకర్యవంతంగా ఎత్తు, వంకర, సందు పళ్లను సవరించుకోవచ్చు.

చిగుళ్ల వ్యాధి.. అల్ట్రాసోనిక్ స్కేలింగ్ సహాయంతో ఎప్పటికప్పుడు దంతాలను శుభ్రం చేసుకోవచ్చు. దంత చికిత్సలో డెంటల్ లేజర్స్ విప్లవాత్మకమైన మార్పుగా చెప్పవచ్చు. ఈ లేజర్స్ ద్వారా ఇంజెక్షన్స్ లేకుండా రక్తస్రావం రాకుండా కుట్లు వేయవచ్చు.

పెద్దాస్పత్రిలో ఉచితంగా ఆధునిక చికిత్సలు

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో దంత వైద్యసేవలు మెరుగయ్యాయి. ఒకప్పుడు రోజుకు 50 మంది వచ్చే రోగులు ఇప్పుడు వందకు చేరారు. ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, వైద్యులు సేవలందిస్తున్నారు. పెరియోడాంటిస్ట్, ఎండోడాంటిస్ట్, ఆర్థో డాంటిస్ట్, ఓరల్ సర్జన్లు ఉన్నారు. పెద్దలతో పాటు చిన్నపిల్లలకూ దంత వైద్యసేవలు అందిస్తున్నారు. పిప్పి పళ్లను సరిచేయడం లేదా తీసేయడం, స్కేలింగ్, చిగుళ్ల వాపులు, రక్తం కారడంపై చికిత్స చేస్తున్నారు. ఇటీవల రూ.8 లక్షలతో ఓపీజీ మిషన్(ఎక్స్‌రే), రూ.8లక్షలతో క్యాన్సర్ స్క్రీనింగ్ కోసం వెల్‌స్కోప్ కొనుగోలు చేశారు.

ఉచితంగా ఆధునిక దంత వైద్య సేవలు



వైద్యులతో పాటు సౌకర్యాలు, పరికరాలు పెరగడంతో రోగుల సంఖ్య పెరిగింది. కాస్మోటిక్స్ మినహా మిగతా అన్ని రకాల దంత వైద్యసేవలు అందిస్తున్నాం. పాడైన దంతాలు, చిగుళ్ల వ్యాధులకు చికిత్స చేస్తున్నాం. గుట్కా తినడం వల్ల పాడైన దంతాలకు చికిత్స చేయడం, నోటి క్యాన్సర్‌తో బాధపడే వారికి చికిత్స అందిస్తున్నాం. ఈ–హాస్పిటల్‌లో రోగుల వివరాలను రికార్డు చేస్తున్నాం.

–బి.భవాని, హెచ్ఓడీ, దంత వైద్యవిభాగం, జీజీహెచ్, కర్నూలు

జాగ్రత్తలు పాటించాలి



దంతాలను రక్షించుకోవడం మన బాధ్యత. ఇందుకు ప్రతి రోజూ రెండు సార్లు ఉదయం, రాత్రి బ్రష్ చేసుకుని చిగుళ్లను మర్దన చేసుకోవాలి. సరైన ఆహారపు అలవాట్లను పాటించాలి. ఆల్కాహాల్, పాన్, గుట్కా వంటి వాటికి దూరంగా ఉండాలి. ఆరు నెలలకు ఒకసారి దంత వైద్యులను సంప్రదించాలి.

–పి.సునీల్‌కుమార్‌రెడ్డి, దంత వైద్యుడు, కర్నూలు

డెంటల్ ఇంప్లాంట్స్.. పక్క పళ్లను ముట్టుకోకుండా పన్ను ఊడినచోటే కొత్తగా కృత్రిమ దంతాన్ని అమర్చే విధంగా సమర్థ విధానమే డెంటల్ ఇంప్లాంట్స్. కృత్రిమ పళ్లను ఒక టైటానియమ్ స్క్రూ ద్వారా ఎముకల్లో అమర్చే పద్ధతిని డెంటల్ ఇంప్లాంట్ అంటారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం


ఆసరా చెక్కును అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి

- వైఎస్సార్ ఆసరా నాల్గో విడత కింద 1,475 సంఘాలకు రూ.8.75 కోట్లు
- నామినేటెడ్ పదవుల్లో 50 శాతం మహిళలకు ఇచ్చిన ఘనత జగనన్నదే
- కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్, ఆదిమూలపు సతీష్

కర్నూలు సిటీ: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టిన నాయకుడు సీఎం వై.ఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు.. మంగళవారం మామిదలపాడులోని ఓ ఫంక్షన్ హాలులో కర్నూలు రూరల్ మండల పరిధిలోని పొదుపు సంఘాల మహిళలకు వైఎస్సార్ ఆసరా సంబరాలు నిర్వహించారు. కర్నూలు రూరల్ మండల పరిధిలోని 1475 సంఘాలకు ఆసరా నాల్గో విడత రూ.8.75 కోట్లు రుణ మాఫీ నిధులను జమ చేశారన్నారు. మహిళాభ్యున్నతికి సీఎం పెద్దపీట వేశారన్నారు. ఎక్కడా లేని విధంగా నామినేటెడ్ పోస్టుల్లో 50 శాతం మహిళలకు.. రాజ్యాంగ పదవుల్లో 50 శాతం బీసీలకు కేటాయించిన ఏకైన నాయకుడు జగనన్న మాత్రమేనని అన్నారు.

పొదుపు మహిళలకు రూ.35 కోట్లు మాఫీ

కర్నూలు రూరల్ మండల పరిధిలోని 1475 పొదుపు సంఘాలకు 2019 ఎన్నికల నాటికి బ్యాంకుల్లో తీసుకున్న రుణాలు రూ.35 కోట్లు ఉన్నాయని... ఇచ్చిన హామీ మేరకు నాలుగు విడతల్లో మొత్తం రుణ మాఫీ చేశారని తెలిపారు. మహిళలకు అమ్మ ఒడి కింద రూ.15 వేలు, చేయూత కింద రూ.18,750, పేదలకు ఇళ్లు అందిస్తున్నామన్నారు. మహిళల రక్షణ కోసం దిశా యాప్, దిశా మహిళా పోలీస్‌స్టేషన్లను తీసుకొచ్చారన్నారు. మరోసారి వైఎస్ జగన్‌ను ఆశీర్వదించాలని కోరారు. అనంతరం ఆసరా చెక్కును అందజేసి సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ డి.వెంకటేశ్వరమ్మ, జెడ్పీటీసీ సభ్యులు ప్రసన్నకుమార్, మౌలాలి, వైస్ ఎంపీపీ నెహిమియా, పార్టీ మండల కన్వీనర్ మహబూబ్ బాషా, జేసీఎస్ కన్వీనర్ సత్యంరెడ్డి, ఎల్లమ్మ ఆలయ పాలక మండలి చైర్మన్ మహేశ్వరరెడ్డి, నాయకులు డి.వాసు, శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ రామ్‌నాథ్ రెడ్డి, చిన్న లక్ష్మన్న, వెంకటేశ్వరరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, పంచలింగాల వెంకటేశ్వరరెడ్డి, గొందిపర్ల గోపాల్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమానికి హాజరైన మహిళలు

రాష్ట్రంలో సుపరిపాలన జగనన్నకే సాధ్యం


అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, ఇంతియాజ్ బాషా

కర్నూలు (టౌన్): రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం చక్కగా అమలు చేస్తూ ప్రజలకు సుపరిపాలన అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని నగర మేయర్ బీవై రామయ్య, కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఇంతియాజ్ బాషా అన్నారు. మంగళవారం స్థానిక రాఘవేంద్రస్వామి మఠం వద్ద రూ.2.20 కోట్లు వెచ్చించి బండ్ రోడ్డు, రాంబొట్ల దేవాలయం వద్ద బండ్ రోడ్డు, జమ్మి చెట్టు వద్ద ఉన్న హిందూ శ్మశాన వాటిక బండ్ రోడ్ల నిర్మాణాలకు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి టీడీపీ నాయకులకు మింగుడు పడటం లేదన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ప్రజలకు సంక్షేమ రూపంలో ఆర్థిక భరోసా కల్పిస్తున్న వ్యక్తి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. పేద ప్రజల ఆర్థిక స్థితిగతులు మార్చిన వ్యక్తి వైఎస్ జగన్ అన్నారు. ఆయన పిలుపు మేరకు ఐఏఎస్ హోదాలో ఉన్న తాను పదవికి రాజీనామా చేసి పార్టీలో చేరానని ఇంతియాజ్ బాషా అన్నారు. కర్నూలు ప్రజలు తనకు అవకాశం కల్పించాలని, నగర అభివృద్ధికి మరింత కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక, కార్పొరేటర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సీఎం దృష్టికి ఉద్యోగుల సమస్యలు


మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, ఇంతియాజ్ బాషాతో ఎన్‌జీఓలు

కర్నూలు (టౌన్): ఉద్యోగుల సమస్యలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తామని మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ కర్నూలు అసెంబ్లీ ఇన్‌చార్జ్ ఇంతియాజ్ బాషా హామీ ఇచ్చారు. మంగళవారం సాయంత్రం ఎస్వీ స్వగృహంలో జిల్లా నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంగళరెడ్డి, బలరామిరెడ్డి, కార్యవర్గ సభ్యులు ఆయన్ను కలిశారు. ఉద్యోగ సంఘం నాయకులకు ఇంతియాజ్‌ను పరిచయం చేయించారు. కర్నూలు అభివృద్ధితో పాటు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు తన వంతుగా కృషి చేస్తానని ఇంతియాజ్ అన్నారు.

దళితుల భూములకు రక్షణ కల్పించండి

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలోని మునగాలపాడులో దళితులు అనుభవిస్తున్న భూములకు పెత్తందార్ల నుంచి రక్షణ కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ కోరారు. మంగళవారం సీపీఎం నేతలు భూములను పరిశీలించారు. గ్రామంలోని సర్వే నంబర్ 20 పరిధిలోని భూములు ఎన్నో ఏళ్ల నుంచి దళితుల అనుభవంలో ఉన్నాయని తెలిపారు. ఇటీవల కొందరు ఆ భూములను స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారని చెప్పారు. అధికారులు స్పందించి ఆక్రమణలకు అడ్డుకోవాలని ఈ సందర్భంగా కోరారు.

మెడికల్ కాలేజీలో అలాంటి నిర్మాణాలు సరికావు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు మెడికల్ కళాశాల ఆట స్థలంలో పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో మల్టీయుటిలిటీ నాలెడ్జ్ సెంటర్ పేరుతో నిర్మాణానికి పూనుకోవడం మంచిది కాదని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.రామాంజనేయులు అన్నారు. ప్రస్తుతం ఉన్న విద్యార్థులతో సంప్రదించకుండా రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి నాలెడ్జ్ సెంటర్ నిర్మాణానికి పూనుకుంటున్నారన్నారు. భవిష్యత్తులో కాలేజీ విస్తరణ, నిధుల కోసం ఇబ్బంది పడే అవకాశం ఉందన్నారు. మెడికల్ కాలేజీ చైర్మన్‌గా ఉన్న కలెక్టర్ రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా కళాశాల ఆట స్థలాన్ని కాపాడాలని కోరారు.

గోనెగండ్ల హిందువుల రుద్ర భూమిని పరిరక్షించండి

కర్నూలు కల్చరల్: గోనెగండ్ల హిందువుల రుద్ర భూమిని పరిరక్షించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని బీజేపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. గోనెగండ్ల గ్రామంలో 233/బి, 225, 227 సర్వే నంబర్లలోని స్థలాన్ని అన్యమత సంస్థలు ఆక్రమించుకుని మసీదులను నిర్మించడాన్ని తప్పుపట్టారు. వీహెచ్‌పీ నాయకులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారని తెలిపారు. కోర్టు స్టే విధించినా జిల్లా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని కోరారు. బీజేపీ నాయకులు రాఘవేంద్ర, మురళి, ఉపేంద్ర, నవీన్, సాయి ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి

- నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ


పరిమళనగర్‌లో అభివృద్ధి పనులను అడిగి తెలుసుకుంటున్న కమిషనర్

కర్నూలు (టౌన్): నగరంలో చేస్తున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ అన్నారు. మంగళవారం స్థానిక పరిమళనగర్‌లో పార్కు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఇప్పటికే ప్రతివార్డు పరిధిలో మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి పనులతో పాటు పార్కులను సుందరంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. ఇంజినీరింగ్ అధికారులు పనుల ప్రగతిని ఎప్పటికప్పుడు తనిఖీ చేసి గడువులోగా పనులు పూర్తి చేయించాలని ఆదేశించారు. పార్కులో రూ.1.06 కోట్లతో ఓపెన్ జిమ్, చిల్డ్రన్స్ పార్కు, ఓపెన్ థియేటర్, యోగా సెంటర్, సిట్టింగ్ ప్లాజా, ఫౌంటెన్, కాఫీ ఏరియా, బాస్కెట్ బాల్ ప్లేకోర్టు వంటి పనులు చేపడుతున్నట్లు డీఈఈ రాజశేఖర్ కమిషనర్‌కు వివరించారు.

నీకు సీటు ఇస్తేనే బీసీలకు న్యాయం చేసినట్టా..?

- దమ్ముంటే ఆలూరు నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చెయ్
- గుమ్మనూరుకు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య సవాల్


విలేకరులతో మాట్లాడుతున్న బీవై రామయ్య

కర్నూలు (టౌన్): నీకు సీటు ఇస్తే బీసీలకు న్యాయం చేసినట్లా? లేకుంటే లేదా.. అవినీతి అక్రమాలు చేశావు.. అందుకే సీటు మార్చారు. ఆలూరు పార్టీ టిక్కెట్ బీసీ సామాజికవర్గానికే ఇచ్చారు కదా అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, నగర మేయర్ బీవై రామయ్య మంత్రి గుమ్మనూరు జయరాంను ప్రశ్నించారు. మంగళవారం స్థానిక నరసింగరావుపేటలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మంత్రివర్గంలో మార్పులు చేసినా గుమ్మనూరు జయరాంను ఐదేళ్లు కొనసాగించారన్నారు. ఆయనకు ఆ విశ్వాసం కూడా లేదన్నారు. ఎన్ని విమర్శలు వచ్చినా పార్టీ నుంచి ఆయన్ను తప్పించకుండా ఎంపీ అభ్యర్థిగా టికెట్ ఇచ్చారని చెప్పారు. తల్లి పాలు తాగి రొమ్ము గుద్దిన చందంగా గుమ్మనూరు వ్యవహరించడం తగదన్నారు. ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి మంత్రి హోదాలో డోన్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారన్నారు. మంత్రి హోదాలో ఉన్న మీరు అదే స్థాయిలో ఆలూరు నియోజకవర్గాన్ని ఎందుకు అభివృద్ధి చేయలేదో సమాధానం చెప్పాలన్నారు. పార్టీని వాడుకుని వదిలేసిన మీరు దమ్ముంటే ఆలూరు నియోజకవర్గంలో టీడీపీ తరఫున నిలబడే ధైర్యం ఉందా? అని ప్రశ్నించారు.

ప్రజలు క్షమించరు

కర్నూలు (టౌన్): ఐదేళ్ల పాటు మంత్రి పదవి అనుభవించి ఇప్పుడు ప్రభుత్వంపై, జగనన్నపై విమర్శలు చేయడాన్ని ప్రజలు క్షమించరని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్ విమర్శించారు. సి.క్యాంప్‌లోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. జగనన్న పెట్టిన భిక్ష వల్లే గుమ్మనూరు జయరాం ఐదేళ్ల పాటు మంత్రి పదవిలో కొనసాగారన్నారు. మోసకారి చంద్రబాబును నమ్ముకోవడం జయరాం మూర్ఖత్వమని చెప్పారు. వ్యక్తిగత, రాజకీయ ప్రయోజనాల కోసం అవకాశవాదంతో పార్టీ మారే నాయకులను వచ్చే ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

9న మతస్వేచ్ఛపై సదస్సు

కర్నూలు(సెంట్రల్): భారత రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో ఈనెల 9వ తేదీ మతస్వేచ్ఛ, మత సామరస్యాన్ని కాపాడాలి అనే అంశంపై సదస్సు నిర్వహించనున్నట్లు సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు పీఎస్ రాధాకృష్ణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జెడ్పీలోని ఎంపీపీ హాలులో ఉదయం 10 గంటలకు జరిగే సదస్సుకు ప్రముఖ సామాజిక విశ్లేషకుడు, దళిత శోషన్ ముక్తి మంచ్ జాతీయ నేత జాన్‌వెస్లీ ముఖ్య వక్తగా హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

నేడు సంపూర్ణ భగవద్గీత పారాయణం

కర్నూలు కల్చరల్: మాఘ విజయ ఏకాదశిని పురస్కరించుకుని సంకల్‌బాగ్‌లోని శ్రీగీతా ప్రచార ధామంలో బుధవారం ఉదయం 9.30 గంటల నుంచి సంపూర్ణ భగవద్గీత పారాయణం నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు డీవీ రమణ తెలిపారు. భగవద్గీత నేర్చుకోవాలనుకునే ఔత్సాహికులు, గీతా ప్రచారకులు, ధార్మిక చింతనాపరులు పాల్గొనాలని కోరారు.

డిగ్రీ విద్యార్థులకు సువర్ణ అవకాశం

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ ఫెయిలైన విద్యార్థులకు పరీక్షలు నిర్వహించడాన్ని స్వాగతిస్తున్నామని ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ (టీఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు చంద్రప్ప అన్నారు. ఆర్‌యూ వీసీగా ప్రొఫెసర్ బి.సుధీర్ ప్రేమ్ కుమార్ బాధ్యతలు చేపట్టిన నెల రోజుల్లోనే అనేక విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. 2008 నుంచి 2015 వరకు డిగ్రీ వార్షిక పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులకు పరీక్షలు నిర్వహించడానికి అనుమతి ఇవ్వడంతో సుమారు 15వేల మంది విద్యార్థులకు అవకాశం లభిస్తుందన్నారు. టీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామరాజు, నాయకులు నరసప్ప, రాకేష్, మహేష్ పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ నిధులను విడుదల చేయాలి


రిలే నిరాహార దీక్ష చేస్తున్న సీపీఐ నాయకులు

కర్నూలు(సెంట్రల్): పెండింగ్‌లో ఉన్న ఆరోగ్యశ్రీ నిధులను విడుదల చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కె.జగన్నాథం డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ దేవరాయల సర్కిల్ వద్ద రిలే నిరాహార దీక్షలు చేశారు. పెండింగ్‌లో ఉన్న 9 నెలల ఆరోగ్యశ్రీ నిధులను విడుదల చేయాలని కోరారు. నాయకులు రామకృష్ణారెడ్డి, శ్రీనివాసులు, మహేష్, నాగరాజు, ఈశ్వర్, అన్వర్ పాల్గొన్నారు.